సాక్షి
అనంతపురం
గురువారం । 31 । అక్టోబర్ । 2024



టీడీపీ నాయకుల దౌర్జన్యం

రాప్తాడు మండలం వరిమడుగు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దౌర్జన్యం చేశారు. 8లో



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.3°/20.5°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జీవితాల్లో వెలుగులు నిండాలి



అనంతపురం కార్పొరేషన్: దీపావళి పండుగ జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన జిల్లావాసులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకట్లు పారదోలి వెలుగులు నింపే పండుగగా ప్రజలందరూ దీపావళిని జరుపుకుంటారన్నారు. పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని కోరారు. పంటలు బాగా పండి రైతులకు లాభాలు చేకూరాలని ఆకాంక్షించారు.

ప్రారంభం కాని పశుగణన

అనంతపురం అగ్రికల్చర్: సాంకేతిక సమస్యలతో పశుగణన కార్యక్రమం ఇంకా ప్రారంభం కాలేదని పశుసంవర్ధకశాఖ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి మంగళవారం తెలిపారు. 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమం ఈనెల 25న దేశవ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభమైనా.. యాప్‌లో సాంకేతిక సమస్య కారణంగా లెక్కింపు నిలిచిపోయిందన్నారు. యాప్‌లో రాష్ట్రాలు, జిల్లాలు, గ్రామాల వివరాలు అక్కడక్కడా పొరపాట్లు ఉన్నందున వాటిని ఉన్నత స్థాయిలో సరిచేస్తున్నట్లు తెలిపారు. దీపావళి పండుగ తర్వాత పశుగణన మొదలయ్యే అవకాశం ఉందన్నారు. యాప్ అందుబాటులోకి వచ్చిన వెంటనే గ్రామ గ్రామాన పశుగణన పక్కాగా చేపట్టడానికి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల బృందాలు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

11 మందికి ఎస్‌ఐలుగా పదోన్నతి

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 11 మందికి ఎస్‌ఐలుగా పదోన్నతి దక్కింది. ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐలుగా వీరికి ఉద్యోగోన్నతి కల్పించారు. దీనిపై జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు జాఫర్ (ఆర్‌ఎస్‌ఐ), సూర్యకుమార్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు, శివప్రసాద్, లక్ష్మీనారాయణ, ఆనంద్, తేజ్‌పాల్, సరోజ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన ఏఎస్పీకి శుభాకాంక్షలు..
నూతన ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషాకు జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

'ఉపాధి' పనులు నాణ్యతగా చేపట్టండి



ఉల్లికల్లులో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న డీడబ్ల్యూఎంఏ పీడీ సలీంబాషా

శింగనమల: ఉపాధి హామీ పథకం కింద పనులను నాణ్యతగా చేపట్టాలని డీడబ్ల్యూఎంఏ పీడీ సలీంబాషా అన్నారు. బుధవారం మండలంలోని నాయనవారిపల్లిలో పర్కులేషన్ ట్యాంక్, ఉల్లికల్లు గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కూలీల హాజరును పరిశీలించారు. వేతనం ఎంత వస్తోందని ఉపాధి హామీ కూలీలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతగా పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

'ముద్ద' నివారణకు 1.75 లక్షల వ్యాక్సిన్లు

అనంతపురం అగ్రికల్చర్: పశువులకు వ్యాపించే ముద్ద చర్మవ్యాధి (లంపీస్కిన్ డిసీస్-ఎల్ఎస్‌డీ) నివారణకు అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టినట్లు స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (అనిమల్ డిసీజెస్ డయోగ్నస్టిక్ ల్యాబ్- ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ ఎన్.రామచంద్ర తెలిపారు. ఇప్పటికే మొదటి విడతగా వ్యాధి నివారణలో భాగంగా అనంతపురం జిల్లాలో 2.37 లక్షలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 2.89 లక్షల గోట్‌పాక్స్ వ్యాక్సిన్లు పశువులకు ఇచ్చామన్నారు. ప్రస్తుతానికి ముద్ద చర్మ వ్యాధి అదుపులోనే ఉందన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఎదుర్కొనేందుకు తాజాగా బెంగళూరులో ఉన్న ఏహెచ్‌వీబీ ల్యాబ్ నుంచి 1.75 లక్షల వ్యాక్సిన్లు తెప్పించామన్నారు. అందులో అనంతపురం జిల్లాకు 90,500, శ్రీ సత్యసాయి జిల్లాకు 84,300 వ్యాక్సిన్లు కేటాయించినట్లు తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలో ఉన్న పశుశాఖ సిబ్బందిని సంప్రదించాలని రైతులకు సూచించారు. వ్యాధిని నివారించడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీవీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్‌లు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

వెలుగు దివ్వెలు.. సంతోష కాంతులు



అనంతపురంలో టపాసులు తీసుకెళ్తున్న మహిళ



దీపాలు కొనుగోలు చేస్తున్న నగరవాసులు

జిల్లావ్యాప్తంగా దీపావళి సందడి మొదలైంది. గురువారం పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమైపోయారు. బాణసంచా కొనుగోళ్లకు బుధవారం పోటెత్తారు. కొనుగోలుదారులతో అనంతపురంలో సందడి నెలకొంది. దీపావళి రోజు సాక్షాత్తు మహాలక్ష్మి భూలోకానికి వచ్చి ఇల్లిల్లూ తిరుగుతుందని అందరి నమ్మకం. ఈ క్రమంలో అమ్మవారికి దీపకాంతులతో స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేశారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురంలో టపాసుల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి



అమ్మకానికి ఉంచిన టపాసులు

మంచే జరిగింది!

- పక్కాగా రీ-సర్వే
- 198 గ్రామాల్లో సభలు
- 1.83 లక్షల ఖాతాల్లోని 5.88 లక్షల ఎకరాల సర్వే
- గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులు 5,421 మాత్రమే

జిల్లాలో రీ-సర్వే ఇలా...

రీ సర్వే జరిగిన గ్రామాలు **198**

సర్వే చేసిన విస్తీర్ణం **5,88,615.62** ఎకరాలు

సర్వే చేసిన ఖాతాలు (ఎల్‌పీ) **1,83,353**

భూ వివాదాలు, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రీ-సర్వే నిర్వహించారు. దీని ద్వారా భూ యజమానులకు మంచి జరిగింది. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఇటీవల రీసర్వేపై నిర్వహించిన గ్రామసభల్లో అందిన ఫిర్యాదుల సంఖ్య ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా 198 గ్రామాల్లో 1,83,353 ఖాతా (ఎల్‌పీ)లకు సంబంధించి 5,88,615.62 ఎకరాలు సర్వే చేశారు. ఆయా గ్రామాల్లో ఈనెల 19 నుంచి 29వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించారు. ఈ క్రమంలో భూ యజమానుల నుంచి కేవలం 5,421 ఫిర్యాదులు అందాయి. ఇందులోనూ సర్వే, రెవెన్యూ పరిధి కాని ఫిర్యాదులు 292 ఉండగా, కోర్టు కేసులు 10 ఉన్నాయి. సర్వే జరిగిన భూములపై అందిన ఫిర్యాదుల సంఖ్యను పరిశీలించగా.. రీ-సర్వేపై భూముల యజమానులు సంతృప్తి చెందారనేది స్పష్టమవుతోంది. రీ-సర్వేపై ఇప్పటి వరకు తప్పుడు ప్రచారం చేస్తూ వచ్చిన వారికి దీన్ని చెంపపెట్టుగా భావిస్తున్నారు.

ఫిర్యాదులు నామమాత్రమే..
రీ-సర్వేపై ఫిర్యాదుల స్వీకరణకు జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో సర్వే జరిగిన 198 గ్రామాల్లో సభలు నిర్వహించారు. మొత్తం 5,421 ఫిర్యాదులు రాగా ఇందులో సర్వే, రెవెన్యూకు సంబంధించి 5,116 ఫిర్యాదులు అందాయి. వీటిలోనూ జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్)కు సంబంధించిన ఫిర్యాదులు 2,900 ఉండడం గమనార్హం. ఇక సర్వే, రెవెన్యూకు సంబంధం లేని ఫిర్యాదులు, కోర్టు కేసుల ఫిర్యాదులు 305 ఉన్నాయి.

- అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో సర్వే జరిగిన 79 గ్రామాల్లో నిర్వహించిన సభల్లో 2,695 ఫిర్యాదులు అందాయి. ఇందులో సర్వే, రెవెన్యూకు సంబంధించి 2,558 ఫిర్యాదులు, వాటికి సంబంధం లేని ఫిర్యాదులు, కోర్టు కేసుల ఫిర్యాదులు 137 ఉన్నాయి.
- గుంతకల్లు డివిజన్ పరిధిలో సర్వే జరిగిన 57 గ్రామాల్లో నిర్వహించిన సభల్లో 1,213 ఫిర్యాదు అందాయి. ఇందులో సర్వే, రెవెన్యూకు సంబంధించి 1,143 ఫిర్యాదులు, సర్వే, రెవెన్యూకు సంబంధం లేని ఫిర్యాదులు, కోర్టు కేసుల ఫిర్యాదులు 70 ఉన్నాయి.
- కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో సర్వే జరిగిన 62 గ్రామాల్లో నిర్వహించిన సభల్లో 1,513 ఫిర్యాదులు అందాయి. ఇందులో సర్వే, రెవెన్యూకు సంబంధించి 1,415 ఫిర్యాదులు, సర్వే, రెవెన్యూకు సంబంధం లేనివి, కోర్టు కేసుల ఫిర్యాదులు 98 ఉండటం గమనార్హం.

30 రోజుల్లో ఫిర్యాదుల పరిష్కారం
రీ-సర్వేకు సంబంధించి అందిన ఫిర్యాదులను నవంబరు నెలాఖరులోగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారని అధికారులు పేర్కొన్నారు.



భూముల రీ-సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

గ్రామసభల్లో అందిన ఫిర్యాదులు

రెవెన్యూ డివిజన్	గ్రామ సభలు	సర్వే ఫిర్యాదులు	రెవెన్యూ ఫిర్యాదులు	సర్వే, రెవెన్యూకు సంబంధం లేని ఫిర్యాదులు, కోర్టు కేసులు	మొత్తం ఫిర్యాదులు
అనంతపురం	79	2,004	554	137	2,695
గుంతకల్లు	57	1,080	63	70	1,213
కళ్యాణదుర్గం	62	1,293	122	98	1,513
మొత్తం	198	4,377	739	305	5,421

ఫిర్యాదులు స్వీకరిస్తాం



రీ-సర్వే జరిగిన 198 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించాం. ఇంకా ఎవరైనా ఫిర్యాదులు ఇస్తే స్వీకరిస్తాం. 198 గ్రామాల్లో 5.88 లక్షల ఎకరాల రీ-సర్వే జరిగింది. 5,421 ఫిర్యాదులు అందాయి. వీటి పరిష్కారానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించాం. నవంబరు నెలాఖరులోగా అన్ని ఫిర్యాదులు పరిష్కరిస్తాం
– రూప్లానాయక్, ఏడీ, సర్వే, భూరికార్డుల శాఖ

గ్రామీణులు ఐకమత్యంతో జీవించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ సూచన



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జీవించాలని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కేకే అగ్రహారం గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో వారు పాల్గొన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. జల్లిపల్లి నాగన్న ఇంటికి వెళ్లి కుటుంబీకులతో మాట్లాడారు. అనంతరం రామాలయంలో పూజలు నిర్వహించి రచ్చకట్ట వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకరు తక్కువ, మరొకరు ఎక్కువ అనే భావనను మనసులో నుంచి తీసివేయాలన్నారు. పిల్లలను బాగా చదివించాలన్నారు. గ్రామాల్లో స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొల్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ ప్రతి నెలా కేకే అగ్రహారంలో సమావేశాలు నిర్వహించి, ఎస్సీ, ఎస్టీల సమస్యలు తెలుసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. చిన్నారులకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, ప్రత్యేక అధికారి శ్రీదేవి, బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, ఎంపీపీ సునీత, తహసీల్దార్ పుణ్యవతి, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాస్, యల్లన్న, సాకే చిరంజీవి, ఏఎండీ ఇమామ్, ఎస్సీ ఎస్టీ ఫోరం రాష్ట్ర నాయకులు రామాంజినేయులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతలో ఐటీ దాడులు



ఐటీ దాడులు జరిగిన గల్లా రవీంద్రనాథ్ నివాసం

అనంతపురం: ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులు అనంతపురంలో మెరుపుదాడి చేశారు. ఈ మధ్య కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఖాతాల్లో అధిక మొత్తంలో నగదు జమ అయినట్లు ఐటీ అధికారులకు సమాచారం అందింది. దీంతో బుధవారం రాత్రి అనంతపురం నగరంలోని గుల్జార్‌పేటలో ఉన్న గల్లా రవీంద్రనాథ్ ఇంట్లో సోదాలు చేశారు. 2014 సంవత్సరంలో రాంనగర్ 80 ఫీట్ రోడ్డు ఎక్స్‌టెన్షన్‌లో నాలుగు ఎకరాల్లో 'గల్లా విల్లాస్' పేరుతో వెంచర్ ఏర్పాటు చేశారు. గల్లా రవీంద్రనాథ్, గల్లా వెంకట శ్రీనివాస్‌తో పాటు మరొక వ్యక్తికి ఇందులో భాగస్వామ్యం ఉంది. ఇందులో పది ఇళ్లకు సంబంధించి ఇటీవల అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పెట్టుకున్నారు. అయితే సర్వర్ సమస్య వల్ల రిజిస్ట్రేషన్ కాలేదు. ఇందుకు సంబంధించిన మొత్తం ఖాతాల్లో లావాదేవీలు జరగడంతో ఐటీ శాఖ అధికారులు దాడి చేశారు. రవీంద్రనాథ్ ఇంట్లో భారీగా నగదు గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ఈ మొత్తం సరైన డబ్బా లేక బ్లాక్ మనీనా అనేది అధికారులు వెల్లడించలేదు. గురువారం రాత్రికి మరో ఐటీ బృందం తనిఖీల్లో పాల్గొననున్నట్లు సమాచారం. అప్పటిదాకా ఐటీ అధికారులు అందరూ ఇక్కడే ఉంటారని తెలిసింది.



రియల్‌ఎస్టేట్ సంస్థ ప్రతినిధులను ప్రశ్నిస్తున్న పోలీసులు



విచారణకు వస్తున్న గల్లా రవీంద్రనాథ్

ఎస్సీ, ఎస్టీల నివాస ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ వినోద్‌కుమార్





హాజరైన అధికారులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు, మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీల నివాస ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా సహాయ, సహకారాలు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు సంబంధించి నిధుల్లో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు ఖర్చు చేయాలని ఆదేశించారు. బ్యాంక్ లింకేజీ ద్వారా ఆ వర్గాలకు మరింత లబ్ధి చేకూర్చాలన్నారు. ఉద్యాన శాఖ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలు మార్చి 31 నాటికి పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు
జిల్లా ప్రజలకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.లక్ష్మీదేవి కరుణ, కటాక్షాలతో జిల్లా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందమయ జీవితం గడపాలని కోరుకున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ వద్దు

- ఎస్పీ జగదీశ్



అనంతపురం: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడరాదని, అసాంఘిక శక్తుల ఆట కట్టించి, అంతటా ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉండాలని ఎస్పీ జగదీశ్ అన్నారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. ఇప్పటి వరకు నమోదైన వివిధ రకాల కేసులను సర్కిళ్ల వారీగా సమీక్షించారు. పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించే విషయంపై సీరియస్‌గా ఆలోచించాలని ఆదేశించారు. ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులకు శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు. కేసుల నమోదు, ఛేదింపు, నేర నియంత్రణ వంటి అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. మట్కా, పేకాట, గంజాయి, ఇసుక అక్రమ రవాణాను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పేర్కొన్నారు. వివిధ కేసుల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేయడం, దర్యాప్తు వేగవంతం, పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడంలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, డీఎస్పీలు మహబూబ్‌బాషా, శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు సహా సీఐలు, ఎస్‌ఐలు హాజరయ్యారు.

డిజిటల్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి
డిజిటల్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జగదీశ్ తెలిపారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు వాట్సాప్, స్కైప్ ద్వారా వీడియో కాల్స్ చేసి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలను భయపెట్టి, డబ్బు వసూలు చేస్తున్నారు. పోలీసులు వాట్సాప్, స్కైప్ వంటి వాటి ద్వారా వీడియో కాల్స్ చేసి మాట్లాడరన్నారు.ఏదైనా నేరానికి సంబంధించి విచారణ చేయాలనుకుంటే నేరుగా సంప్రదిస్తారని పేర్కొన్నారు.

పండుగ ఆనందంగా జరుపుకోవాలి
చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకునే దీపావళిని జిల్లా ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ జగదీశ్ ఆకాంక్షించారు. ఈ దీపావళి చీకట్లను పారదోలి ప్రజలందరి జీవితాల్లో కాంతులు నింపాలని కోరుకున్నారు. పండుగ సందర్భంగా పిల్లలు టపాసులు కాల్చే సమయంలో కనీస జాగ్రత్తలు పాటించేలా తల్లిదండ్రులు దగ్గరుండి చూసుకోవాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగేంద్ర (40) ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు మతి స్థిమితం లేదు. కుటుంబపోషణ, గొర్రెల కొనుగోలుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు లోనైన ఆయన గ్రామ శివారులోని చెట్టుకు బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఉద్యోగం రాలేదంటూ యువతి ఆత్మహత్య



నవ్య (ఫైల్)

బెళుగుప్ప: ఉన్నత చదువులు అభ్యసించినా ఉద్యోగం రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన కమ్మ రామాంజనేయులు, నాగమణి దంపతుల కుమార్తె నవ్య (22) అనంతపురంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో డిగ్రీ వరకూ చదువుకుంది. అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి సాఫ్ట్‌వేర్ కోర్సు పూర్తి చేసింది. ఈ క్రమంలో ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అయినా ఫలితం దక్కలేదు. దీంతో ఇంటికి చేరుకున్న ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

శేషజీవితం ఆనందంగా గడపండి

ఉద్యోగ విరమణ పొందిన వారితో కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్వో మలోల



అనంతపురం అర్బన్: ఉద్యోగ విరమణ చేసిన మీరంతా శేష జీవితాన్ని ఆనందంగా గడపండి అంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఈ నెలలో ఉద్యోగ విరమణ చేసిన వారికి జిల్లా యంత్రాంగం తరఫున బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఉద్యోగ విరమణ చేసి వారిని కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, మెజిస్టీరియల్ విభాగం సూపరింటెండెంట్ వసంత లత, భూసంస్కరణ విభాగం సూరింటెండెంట్ నారాయణస్వామి, ఉద్యోగ విరమణ చేసిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాగమణి హత్య కేసులో వీడిన మిస్టరీ

- ఇద్దరి అరెస్ట్
- నగలు, నగదు కోసమే హత్య

అనంతపురం: నగరంలో సంచలనం రేపిన గుజ్జల గంగమ్మ అలియాస్ నాగమణి హత్యకేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. అనంతపురంలోని ఎర్రనేల కొట్టాలలో నివాసముంటున్న నాగమణి (48) హత్య ఉదంతం ఈ నెల 20న ఉదయం వెలుగు చూసింది. ఈ కేసు దర్యాప్తును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ శాంతిలాల్ ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా విడిపోయి లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అనంతపురానికి చెందిన చుక్కలూరు జయప్రకాష్ , ఆకుమల్లెల హరినాథ్ బాబు అలియాస్ హరిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నేరం చేసినట్లుగా అంగీకరించారు.

జల్సాలకు అలవాటు పడి

వ్యసనాలకు బానిసలైన హరి, జయప్రకాష్ తమ జల్సాలకు అవసరమైన డబ్బును సులువుగా సంపాదించుకునేందుకు నేరాలను ఎంచుకున్నారు. ఈ క్రమంలో తన పెద్దనాన్న బలిజ రామకృష్ణ ఇంటి రెండో అంతస్తులో ఒంటరిగా అద్దెకు ఉంటున్న నాగమణిపై జయప్రకాష్ దృష్టి పడింది. పథకం ప్రకారం ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటల సమయంలో జయప్రకాష్ వాళ్ల ఇంటిపై నుంచి ఇద్దరూ గోడెక్కి నాగమణి నివాసముంటున్న గది పక్కన దిగారు. అనంతరం నాగమణి ఇంటి తలుపు వద్ద హరి కాపలాగా ఉండగా, గదిలోకి జయప్రకాష్ చొరబడ్డాడు. గమనించిన నాగమణి గట్టిగా కేక వేయబోతుండగా జయప్రకాష్ ఆమెను మంచం పైకి పడేసి ఎడమ చేతిని నోటిపై అదిమి పెట్టి కుడి చేతితో గొంతు నులిమి హతమార్చాడు. అనంతరం హతురాలి మెడలోని బంగారు చైన్, చెవులకున్న కమ్మలు, వెండి పట్టీలు, రూ.4 వేల నగదు, సెల్‌ఫోన్ తీసుకుని, గది లోపల, చుట్టుపక్కల కారం పొడి చల్లి ఉడాయించారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేయడంతో భయపడిన నిందితులు నేరుగా ఎర్ర నేల కొట్టాల 1వ సచివాలయం వీఆర్వో స్వర్ణలత సమక్షంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు పోలీసులకు లొంగిపోయారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకోనున్నట్లు సీఐ శాంతి లాల్ తెలిపారు. నాగమణిని హతమార్చిన అనంతరం సాక్ష్యాలను రూపుమాపేలా కారంపొడి చల్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ వీరు ఏమైనా నేరాలకు పాల్పడి ఉంటారని, వాటి గురించి ఆరా తీసేందుకు నిందితులను పోలీస్ కస్టడీకి కోరనున్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం



టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన బండలు

రాప్తాడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. రోజూ ఏదో ఒక గ్రామంలో దాడులు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా మంగళవారం రాప్తాడు మండలం పరిమడుగులో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ నాయకులు దాడి చేసి, బండలను ధ్వంసం చేశారు. బాధితులు తెలిపిన మేరకు... అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ 2014లో రాప్తాడు ఎంపీపీగా ఉన్న సమయంలో ఆయన స్వగ్రామమైన ఎం.బండమీదపల్లి పంచాయతీలోని పరిమడుగు గ్రామ దళితుల అభ్యర్థన మేరకు ఇళ్ల స్థలాలను అందజేశారు. ఇందు కోసం ఎం.బండమీదపల్లి నివాసి వడ్డే ఈశ్వరయ్యకు చెందిన రెండు ఎకరాల పొలాన్ని ఆయన తన సొంత డబ్బు పెట్టి కొనుగోలు చేసి ఒక్కొక్కరికి 2.50 సెంట్ల చొప్పున 30 మందికి అందజేశారు. ఇళ్ల పట్టాలు అందుకున్న వారిలో కొందరు ఆర్డీటీ సహకారంతో పక్కా గృహాలు నిర్మించుకున్నారు. మరికొందరు సొంత డబ్బుతో, ఇంకొందరు ప్రభుత్వ సాయంతో ఇళ్లను నిర్మించుకున్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కొందరు దళితులు గృహాలు నిర్మించుకోలేక స్థలాన్ని అలాగే పెట్టుకున్నారు. ఆ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు మంగళవారం ఉదయం జయరాం, జగన్, మోహన్ వారి ప్లాట్ల చుట్టూ బండలు పాతేందుకు గుంతలు తీస్తుండగా... అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శ్రీరాములు, ఓబులపతి, ఫక్కీరప్ప, రవి, లక్ష్మన్న, అశోక్, సురేష్‌తో పాటు మరికొందరు అడ్డుకున్నారు. అందరూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే కావడంతో ఆ ప్లాట్లను రద్దు చేస్తున్నామని, ఆ పట్టాలు తమకివ్వాలంటూ బండలను పగులగొట్టారు. అడ్డుకోబోయిన జయరాం, మోహన్, జగన్ ఆయన భార్య హైమావతిపై దాడి చేశారు. నోరెత్తితే చంపి అక్కడే పాతి పెడతామని బెదిరించారు. ఆ సమయంలో కొందరు తమ సెల్ ఫోన్లలో వీడియో తీస్తుండగా ఎస్పీకి ఫిర్యాదు చేసినా తమనెవ్వరూ ఏమీ చేయలేరంటూ రెచ్చిపోయారు.

రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం

- రైతు సంఘం నాయకుల ధ్వజం



టవర్‌క్లాక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలుతోందని ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు ధ్వజమెత్తారు. జిల్లాలోని 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలంటూ బుధవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా కార్యదర్శులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.కృష్ణమూర్తి, ఎం.బాలరంగయ్య మాట్లాడారు. ఖరీఫ్‌లో వర్షాలు రాక జిల్లాలో 3 లక్షల ఎకరాలు బీడుగా మారాయన్నారు. వేరుశనగ, పత్తి, కంది, ఆముదం, తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అయితే ప్రభుత్వం మొత్తం ఖరీఫ్ సగటు వర్షపాతం ఆధారంగా ఏడు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి మిగిలిన మండలాల రైతులకు ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. కరువు జిల్లాగా ప్రకటించి, పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే 2023 ఖరీఫ్, రబీ పంటల బీమా, నష్టపరిహారం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు నాగేంద్ర కుమార్, తరిమెల నాగరాజు. శివారెడ్డి, నల్లప్ప, వెంకట కొండ, రమేష్, నాగమ్మ, చిదంబరమ్మ, సువర్ణమ్మ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిషిప్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్/క్రైం: ఆర్టీసీలో అప్రెంటిషిప్ చేసేందుకు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, ఆర్టీసీ జోనల్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నజీర్‌అహ్మద్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన అభ్యర్థులు అర్హులు. నవంబర్ 5 నుంచి 19వ తేదీలోపు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 88868 85173లో సంప్రదించవచ్చు.

కరువు జిల్లాగా ప్రకటించండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పూర్తిగా నష్టపోయినందున జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్పతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కీలకమైన జూలై, నవంబరు మాసాల్లో జిల్లావ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదు కావడం, పంటలు పూర్తిగా దెబ్బతినడం అధికారులకు తెలియని విషయం కాదన్నారు. అయినా పట్టించుకోకుండా ఖరీఫ్ సగటు వర్షపాతం ఆధారంగా కేవలం ఏడు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది రైతులకు ఒక విధంగా ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. దీనిపై జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లి అన్ని మండలాలు కరువు మండలాలుగా ప్రకటించి, రైతులను ఆదుకోవడంతో పాటు కూలీలకు ఉపాధి పథకం కింద అదనపు పనిదినాలు కల్పించి ఆదుకోవాలన్నారు.









క్లుప్తంగా

మేయర్ వసీం జన్మదిన వేడుకలు



మేయర్ వసీంకు కేక్ తినిపిస్తున్న అధికారులు, కార్పొరేటర్లు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో మేయర్ వసీం జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కమిషనర్ నాగరాజు, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్ల సమక్షంలో మేయర్ కేక్ కట్ చేసి అందరికీ అందించారు. ఈ సందర్భంగా మేయర్ వసీంకు వారు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్ భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, సైపుల్లా బేగ్, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను కంపోస్టుకు తరలించాలి



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచనలిస్తున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

అనంతపురం కార్పొరేషన్: చెత్తను సకాలంలో కంపోస్టుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. బుధవారం నగరంలోని సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్, రాజు రోడ్డు, కమలానగర్, సూర్యనగర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు వేకువ జామున నుంచే క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అదేవిధంగా వ్యాపారులు చెత్తను రోడ్డుపై వేయకూడదన్నారు. డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన తోపుదుర్తి పాఠశాల విద్యార్థులు

ఆత్మకూరు: అనంతపురంలో బుధవారం జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. అండర్–14 విభాగంలో తోపుదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 7వ తరగతి చదువుతున్న బ్లెస్సీ, హారిక, లిఖిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదే విధంగా స్కిప్పింగ్‌లో 6వ తరగతి చదువుతున్న స్వాతి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థులను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రఘురాములు, శ్రీవాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్‌వైకేలో వల్లభాయ్ పటేల్ జయంతి

అనంతపురం కల్చరల్: నెహ్రూ యువకేంద్రంలో బుధవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. యువజన సంక్షేమ శాఖ మేనేజర్ సునీల్ కుమార్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్‌కుమార్, జయమారుతి, జీవన్ కుమార్, డాక్టర్ బాలాజీ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి పటేల్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నిజాం పాలనలో మగ్గిపోతున్న తెలంగాణకు విముక్తి కల్పించిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. స్ఫూర్తిని చాటుతున్న వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో ప్రగతి పథం సంస్థ సభ్యులు పవన్, అభిలాష్, రూబీఖాన్, సాయి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో లాభాలు



మాట్లాడుతున్న ఏఎఫ్ ఎకాలజీ ప్రతినిధులు

ఆత్మకూరు: తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా చిరుధాన్యాల పంటలు సాగు చేయాలని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ సెంట్రల్ ఎస్‌ఏడీఎల్ కో–ఆర్డినేటర్ రుద్రయ్య తెలిపారు. బుధవారం మండలంలోని సనప గ్రామం వద్ద ప్రకృతి వ్యవసాయ మిశ్రమ ఆహార పంటలపై క్షేత్రస్థాయి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కొర్ర, సజ్జ, జొన్న, తదితర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన వ్యవసాయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, అధిక పెట్టుబడులపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల దిగుబడి పెరిగి భూమి సారవంతంగా మారుతుందని పేర్కొన్నారు. ఒకే పంట సాగు చేయడం వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎంఈ టీమ్ లీడర్ బ్రహ్మేష్, కమ్యూనికేషన్ అసోసియేట్ అమీన్, మండల టీమ్ లీడర్ ఓబుళపతి, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు బస్టాండ్ ముందు పెరిగిన ముళ్ల చెట్లు



వృథాగా ఉన్న మరుగుదొడ్లు



బస్టాండ్ లోపల ఇలా..



బస్టాండ్ ఆవరణలో ఏర్పడిన గుంతలు

ముళ్ల కంపలు పెరిగి.. నిరుపయోగంగా మారి

- చెత్తాచెదారంతో నిండిపోయిన ఆత్మకూరు బస్టాండ్

ఆత్మకూరులో ప్రయాణికుల కోసం నిర్మించిన బస్టాండ్ పిచ్చి మొక్కలు, అపరిశుభ్రతతో దర్శనమిస్తోంది. ముళ్ల కంపలు, చెత్తా చెదారం పేరుకుపోయి నిరుపయోగంగా మారిపోయింది. బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు బస్టాండ్ లోపలికి వెళ్లకపోవడంతో ఆర్టీసీ బస్సులు కూడా బస్టాండ్ లోపలికి వెళ్లకుండా నేరుగా వెళ్లిపోతున్నాయి. బస్టాండ్ చుట్టూ పెద్ద పెద్ద ముళ్ల కంపల చెట్లు పెరిగిపోవడంతో విష పురుగులు సంచరించే అవకాశం ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా మహిళలు, పురుషుల కోసం ప్రత్యేకంగా బస్టాండ్ వెనుక ఆవరణలో మరుగుదొడ్లు నిర్మించారు. మరుగుదొడ్లను వినియోగించక పోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. కనీసం లోపలికి వెళ్లడానికి వీలు లేని విధంగా ముళ్ల చెట్లు పెరిగాయి. ఇక వర్షం వస్తే బస్టాండ్ ఆవరణలో ఉన్న పెద్ద పెద్ద గుంతల్లో వర్షపు నీరు చేరుతోంది. రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా ఆర్టీసీ అధికారులు మాత్రం ఆత్మకూరు బస్టాండ్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. – ఆత్మకూరు:

నగరాభివృద్ధికి పటిష్ట చర్యలు



వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరాభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మేయర్ వసీం తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థలో పారిశుద్ధ్యం మెరుగుకు నగరపాలక సంస్థ కొనుగోలు చేసిన రూ.1.25 కోట్ల వాహనాలను ప్రారంభించారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులతో పరికరాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షలతో రెండు జేసీబీలు, ఎన్‌సీఏపీ నిధులు రూ.12 లక్షలతో నాలమాన్, రూ.33 లక్షలతో మూడు ట్రాక్టర్లు, రూ.10 లక్షలతో వాటర్ ట్యాంక్‌ను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. నూతన పరికరాల ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ మరింత వేగవంతమవుతుందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నగర ప్రజలు సైతం చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, సైపుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



కార్యకర్తలకు బీరువాలు అందిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ, సాధిక్ వలి

అనంతపురం రూరల్: అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా కార్యకర్తలకు అండగా ఉంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామని రుద్రంపేట ఎంపీటీసీ–4 సభ్యురాలు మహబూబీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి అన్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని బుధవారం చంద్రబాబు నగర్‌లోని ముగ్గురు కార్యకర్తలకు సొంత ఖర్చులతో రూ.30 వేలు విలువ చేసే బీరువాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ, సాదిక్‌వలి మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నిలవాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచనల మేరకు పని చేసి రుద్రంపేట పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తామన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఖాజా, అక్కమ్మ, వెంకటరాముడు, నాగమణి, జయమ్మ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఈఓ ప్రసాద్ బాబును సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో పెండింగ్ ఉన్న టీచర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కార్యాలయంలో కలిసి సన్మానించారు. సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, సయ్యద్ సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. 2002 డీఎస్సీ తర్వాత ఎస్జీటీలు, పాఠశాల సహాయకుల రెగ్యులరైజేషన్ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు అలాగే ఉండిపోయాయని వాపోయారు. ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎంలు, పాఠశాల సహాయకుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో కాలయాపన జరుగుతోందన్నారు. వ్యక్తిగత పనిష్‌మెంట్ల విషయంలో క్లియర్ అయిన సమస్యలనూ పట్టించుకోవడం లేదన్నారు. డీఈఓ స్పందిస్తూ తప్పకుండా సమస్యలను త్వరలో పరిష్కరించేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, కార్యదర్శి ఓబులేసు, నాయకులు వన్నప్ప, సర్దార్ వలి, వెంకటరమణ, రామకృష్ణ, రంగనాయకులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి



సీఐ టీవీ శ్రీహర్షకు వినతిపత్రం ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో వెలసిన శ్రీగౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకూ కార్తీక మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రెసిడెంట్ రాజుల తిమ్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రెనాటి కొండా రెడ్డి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు చేపట్టాలని సీఐ టీవీ.శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ వరకు కార్తీక మహోత్సవాలు నిర్వహించాలని ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు తీర్మానించడం జరిగిందన్నారు. ఆలయంలో రోజై ఉదయం, సాయంత్రం స్వామికి అభిషేకం చేస్తామన్నారు. సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, కార్తీక పౌర్ణమి రోజున సాయంత్రం 4 గంటల నుండి అభిషేకం, కోటీ దీపోత్సవం, మహాజ్యోతి, జ్వాలాతోరణంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్మయ నంద మిషన్ జిల్లా ప్రెసిడెంట్ స్వామి ఆత్మవిదానంద, ఆలయ కమిటీ సభ్యులు కేతిరెడ్డి పరంధామ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, సుంకి రెడ్డి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో ఆర్డీటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీటీ ప్రోగాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ బుధవారం ప్రారంభించారు. రూ.21 లక్షల ఆర్డీటీ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీపీఓ నాగరాజు నాయుడు, డీఎల్డీ లలితాబాయి, సర్పంచ్ ఎర్రిస్వామి, సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి, పలువురు టీడీపీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి

రాప్తాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అడిగిన వారందరికీ పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి ఉపాధి సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని గాండ్లపర్తి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలోని రికార్డులు పరిశీలించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావాలన్నారు. హాజరు కాని సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని ఉపాధి పనులు, హార్టికల్చర్ పనులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తి చేసుకుని రైతులు కూలీలు పనులు లేక ఖాళీగా ఉన్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో అడిగిన ఉపాధి కూలీలందరికి పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని గుర్తు చేశారు. ఉపాధి కూలీలు పనులు అడిగిన 15 రోజుల్లోపు పనులు కల్పించకపోతే వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుదని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ కనీసం 150 మందికి తక్కువ కాకుండా పనులు కేటాయించాలన్నారు. ఉపాధి పనులపై నిర్లక్ష్యం చూపితే చట్టపరమైన చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ సావిత్రి, ఈసీ మురళి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు శుభపరిణామం



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురం రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం శుభపరిణామం. అయితే అనాదిగా చైర్మన్ పదవి విశ్వబ్రాహ్మణులకు కేటాయించడం జరుగుతోంది. ఇప్పుడు కూడా విశ్వబ్రాహ్మణులకే చైర్మన్ పదవి కేటాయించాలని పంచ వృత్తుల సంక్షేమ సంఘం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ రావు, బీసీ సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌బాబు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. బుధవారం విజయవాడలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రిని కలసి వరద భాధితుల సహాయార్థం రూ.10 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలు నేరవేర్చడంతో పాటు తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. స్వర్ణకారుల సమస్యలపై అవగాహన ఉన్న విశ్వబ్రాహ్మణులకు కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయిస్తే స్వర్ణకారుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు సురేంద్ర గౌడ్, విజయ్, క్రాంతికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


టపాకాయలు సీజ్

అనంతపురం: అరవింద్‌నగర్‌లోని ఒక ఇంటి కాంపౌండ్‌లో అక్రమంగా టపాకాయలు విక్రయిస్తున్న ఆకుల శరత్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా అమ్ముతున్న 105 టపాకాలయ బాక్సులను సీజ్ చేశామన్నారు. వీటి విలువ రూ.75,090 ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రుషేంద్రబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ ప్రతిష్ట

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలోని అన్నపూర్ణ మంజునాథేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా బుధవారం గణపతి, నవగ్రహ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం గోపుర కలశ ప్రతిష్ఠలు వైభవంగా సాగాయి. ప్రధాన అర్చకుడు బసవరాజ స్వామి నేతృత్వంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏకవార రుద్రాభిషేకాలు, రుద్రం, నమకం, చమకం పఠనం, విశేష భస్మార్చన జరిపించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన శివస్వాములు శివస్తుతి చేస్తూ వేదమంత్రాల నడుమ కలశాలను ప్రతిష్ఠించారు. జిల్లాలోనే తొలిసారి గంటల రథం ఏర్పాటు చేస్తున్నామని భక్తులందరూ భాగస్వాములు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. అనంతరం మహా మంగళహారతి, అన్నదానం జరిగాయి.

ఇన్ఫోసిస్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం టవర్‌క్లాక్: ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా అనంతపురంలో వరద బాధితులకు సహాయం చేయడం అభినందనీయమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఫౌండేషన్ నిర్వాహకుడు స్వామి జపానంద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన ఇన్ఫోసిస్ స్వచ్ఛంద సంస్థ అనంతపురంలోని పేద ప్రజలకు సహాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రూ.2,500 విలువైన సరుకులు అందజేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జపానంద స్వామి మాట్లాడుతూ.. పేద ప్రజలకు సేవ చేసేందుకు స్వచ్ఛంద సంస్థను స్థాపించామన్నారు.

అంధులకు దీపావళి కానుక

అనంతపురం కల్చరల్: ఇటీవల వివాహం చేసుకున్న అంధుల కుటుంబాలకు సాయిట్రస్టు వారు బుధవారం రూ.30 వేలు విలువ చేసే దీపావళి కానుకలు అందజేశారు. వారి జీవనాధారం కోసం పాటలు పాడుకుంటూ జీవించడానికి అవసరమైన స్పీకర్, మైకు సెట్టుతో పాటూ మరో రూ.15 వేలతో వంట సామగ్రి, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. స్థానిక జేఎన్టీయూ రోడ్డు సమీపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అంధ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జలంధర రెడ్డి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్స్ వెంకట నారాయణ, ట్రస్టు ప్రతినిధులు విజయసాయి, రాఘవేంద్ర, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటనలో అన్యాయం

అనంతపురం అర్బన్: కరువు మండలాల ప్రకటించడంలో జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఏపీ రైతు సంఘం (సీపీఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నప్ప యాదవ్, చిరుతల మల్లికార్జున మండిపడ్డారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. అయితే కేవలం ఏడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి మిగిలిన 24 మండలాల రైతులకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎన్నికల్లో చెప్పిన విధంగా పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చని పక్షంలో పోరాటాలు సాగిస్తామన్నారు.

ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించాలి

ఆత్మకూరు: ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం, సీపీఐ మండల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ లక్ష్మీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో జిల్లాలోని 31 మండలాలకు గాను కేవలం 7 మండలాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. మిగిలిన 24 మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం, వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ పథకం ద్వారా అదనపు పని దినాలు కల్పించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వేరుశనగ, కంది, పత్తి, ఆముదం పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, శివ, సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ యంత్రంలో పడిన వ్యక్తి

రాప్తాడు రూరల్: ప్రమాదవశాత్తూ యంత్రంలో పడి ఓ వ్యక్తి కాలు తెగిపోయిన ఘటన మంగళవారం అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బళ్లారిరోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సెజురూల్ అనే వ్యక్తి డ్రిప్ కటింగ్ మిషన్‌లో పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా సోదరుడితో కలిసి పని చేస్తుండగా.. ఒక యంత్రంను స్టార్ట్ చేయాల్సింది పోయి మరో యంత్రాన్ని సెజురూల్ సోదరుడు ఆన్ చేశాడు. ఊహించిన పరిణామంతో అదుపుతప్పి ఆ యంత్రంపై పడ్డాడు. దీంతో మోకాలి పైభాగం వరకూ కుడికాలు తెగిపోయింది. క్షతగాత్రుడిని హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

అనంతపురం: బాణా సంచా విక్రయించే ప్రదేశంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు ఉండకూడదని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. నగర శివారులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన క్రాకర్స్ స్టాల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పటిష్ట భద్రత చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనల మేరకు దుకాణాల నిర్వహణ ఉండాలన్నారు. దుకాణాల మధ్య దూరం పాటించకపోవడం, తదితర నిబంధనలు సక్రమంగా పాటించని దుకాణాలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అనుకోకుండా అగ్నిప్రమాదం జరిగితే ఎలా ఆర్పి వేయాలో డెమో చేయించారు. ఏదైనా విపత్తు సంభవిస్తే డయల్ 101, పోలీసు డయల్ -100కు గానీ, డయల్-112గాని సమాచారం అందించాలన్నారు.